
పాత శివాలయం వద్ద పూజలో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు తదితరులు


వేంకటేశ్వర నగర్‌లోని మంజునాథ ఆలయంలో అభిషేకం నిర్వహిస్తున్న భక్తులు

భక్తిశ్రద్ధలతో కార్తీకమాసం పూజలు

ఆల్విన్‌కాలనీ: పవిత్ర కార్తీక మాసం ప్రారంభమైన సందర్భంగా శనివారం కూకట్‌పల్లి సర్కిల్‌ పరిధిలోని శైవ క్షేత్రాలతో పాటు వైష్ణవ క్షేత్రాలు భక్తులతో కిటకిటలాడాయి. పెద్ద సంఖ్యలో ఉదయం నుంచే భక్తులు బారులు తీరి స్వామివార్లకు పంచామృతాభిషేకాలు నిర్వహించి పెద్ద ఎత్తున పూజలు నిర్వహించారు. కూకట్‌పల్లి పాత శివాలయం, కేపీహెచ్‌బీ కాలనీలోని శ్రీ ఏకాంబరేశ్వర శివాలయం, ఆల్విన్‌ కాలనీలోని శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి దేవాలయం, జగద్గిరిగుట్టలోని వేంకటేశ్వర నగర్‌లోని మంజునాథ ఆలయం, వివేకానందనగర్‌లోని వేంకటేశ్వర స్వామి తదితర ఆలయాల్లో స్వామివార్లకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. సాయంత్రం ఆలయాల్లో ధ్వజ స్తంభానికి జ్వాలా తోరణం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు కూకట్‌పల్లిలోని పాత శివాలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.


ప్రత్యేక అలంకరణలో వివేకానంద నగర్‌లోని శ్రీ వేంకటేశ్వర స్వామివారు

లీకేజీలతో.. వృథాగా తాగునీరు

జలమండలి అధికారుల అలసత్వం కారణంగా తాగునీటి పైపులైన్లు లీకేజీ కావడంతో వాటిలో కలుషిత జలాలు కలిసి సరఫరా అవుతున్నాయి. కూకట్‌పల్లి సర్కిల్‌ పరిధిలో కాలం చెల్లిన తాగునీటి పైపులైన్లు నిత్యం ఏదో ఒక ప్రాంతంలో లీకేజీలతో నీరు రోడ్లపై ఏరులై పారుతోంది. గ్యాలన్ల కొద్దీ తాగునీరు వృథాగా పోతుండటంతో స్థానికులు అధికారులపై తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి లీకేజీలకు శాశ్వత పరిష్కారం చూపాలని స్థానికులు వేడుకుంటున్నారు.
– ఆల్విన్‌కాలనీ

- లీకేజీల ద్వారా తాగునీటి పైపులైన్‌లో కలుషిత జలాలు
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న కాలనీల ప్రజలు
- మరమ్మతులు అంతంతే


ఆల్విన్‌కాలనీ నాలా బ్రిడ్జి వద్ద రోడ్డుపై ప్రధాన పైపులైన్‌ లీకేజీతో ఏరులై పారుతున్న తాగునీరు

కూకట్‌పల్లి సర్కిల్‌ పరిధిలోని ఆల్విన్‌కాలనీ, వివేకానందనగర్‌, హైదర్‌నగర్‌, కూకట్‌పల్లి డివిజన్‌లలోని పలు కాలనీల్లో తాగునీటి పైపులైన్ల లీకేజీతో నీరు రోడ్లపై పారుతుంది. దీంతో వాహనదారులు, పాదాచారులు ఇబ్బందులకు గురవుతున్నారు. కలుషిత జలాల ద్వారా తాగునీరు దుర్వాసన వస్తుందని కాలనీ వాసులు పేర్కొంటున్నారు. నిత్యావసరాలకు కూడా మంచినీరు వాడుకోవటానికి పనికి రావటం లేదు. ప్రధాన పైపులైన్‌లు శిథిలావస్థకు చేరుకోవటం, మరమ్మతులు చే సినా కొద్ది రోజులకే ఆ ప్రాంతంలో తిరిగి లీకేజీల పర్వం కొనసాగుతున్నదని స్థానికులు పేర్కొంటున్నారు.

పైపులైన్‌ లీకేజీ ప్రాంతాలు

- ఆల్విన్‌కాలనీ పైపులైన్‌ రోడ్డులోని నాలా బ్రిడ్జి వద్ద కొద్ది రోజుల క్రితమే ప్రధాన పైపులైన్‌ లీకేజీ కావడంతో మరమ్మతులు చేసి మమ అనిపించారు. కొద్ది రోజులు కూడా గడవక ముందే అదే ప్రాంతంలో లీకేజీల పర్వం మొదలైంది.
- పైపులైన్‌ రోడ్డులోని ఎస్‌ఎస్‌డీ స్కూల్‌ సమీపంలో ప్రధాన రహదారిలో ప్రధాన పైపులైన్‌ లీకేజీతో గ్యాలన్ల కొద్దీ తాగునీరు వృథాగా పోతోంది.
- పైపులైన్‌ రోడ్డులోని హెచ్‌పీ పెట్రోల్‌ బంక్‌ ముందు పైపులైన్‌ నుంచి తాగునీరు కొన్ని రోజులుగా లీకేజీ అవుతుందని స్థానికులు ఫిర్యాదు చేసినా పట్టించుకున్న నాథుడే కరువయ్యారు.
- ఆస్‌బెస్టాస్‌ కాలనీ వాటర్‌ ట్యాంక్‌ వద్ద పైపులైన్‌ వాల్వ్‌ లీకేజీతో రహదారుల వెంట తాగునీరు వృథాగా పోతున్నది.
- చిత్తారమ్మ దేవాలయ సమీపంలోని ప్రధాన కూడళ్ల వద్ద మాన్‌హోల్‌లోని వాల్వ్‌ లీకై నీరు వృథాగా పోవడమే కాకుండా చెత్తా చెదారం వాల్వ్‌లో చేరి సరఫరా అవుతున్నాయి.
- కూకట్‌పల్లి, వివేకానందనగర్‌ కాలనీ బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయం ముందు కొన్ని నెలలుగా వాల్వ్‌ లీకై తాగునీరు వృథాగా పోతుంది.
- జగద్గిరిగుట్ట ఇందిరా గాంధీ విగ్రహం ముందు మంచినీరు వృథాగా రోడ్డు పాలవుతున్నాయి.
- భాగ్యనగర్‌ కాలనీలోని గోవింద్‌ హోటల్‌ చౌరస్తాలో తాగునీటి పైపులైన్‌ లీకేజీతో వాహనదారులు, పాదాచారులు ఇబ్బందులకు గురవుతున్నారు.
- పైవిధంగా పలు ప్రాంతాల్లో తాగునీటి పైపులైన్‌లు లీకేజీ ద్వారా మురుగునీరు సరఫరాతో ప్రజలు అస్వస్థతకు గురై ఆసుపత్రుల పాలవుతున్నారు. సమస్య పునరావృతం అయినప్పుడల్లా అధికారులు, కాంట్రాక్టర్లకు పనులు అప్పగించి తూతూ మంత్రంగా మమ అనిపించటం తప్ప సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించటం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాంట్రాక్టర్లు ఇచ్చే మామూళ్లకు అలవాటు పడి పనుల్లో నాణ్యతా ప్రమాణాలను గుర్తించటం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి తాగునీటి పైపులైన్ల లీకేజీలకు శాశ్వత పరిష్కారం చూపాలని వేడుకొంటున్నారు.


ఆల్విన్‌కాలనీలోని ఎస్‌ఎస్‌డీ స్కూల్‌ వద్ద రోడ్డుపై లీకవుతున్న తాగునీరు


వివేకానందనగర్‌ కాలనీ బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయం ముందు ..

ఏళ్లుగా ఖాళీలే..!

- పురపాలికల్లో భర్తీకి నోచుకోని పారిశుధ్య కార్మికులు
- లోపిస్తున్న స్వచ్ఛత
- 13 మున్సిపాలిటీల్లో అవుట్‌ సోర్సింగ్‌ కింద కేవలం 1746 మందే
- జనాభా ప్రతిపాదికన కార్మికులను భర్తీ చేయాలంటున్న పుర ప్రజలు



సాక్షి,సిటీబ్యూరో: మున్సిపాలిటీల్లో ఏళ్లుగా పారిశుద్ధ్య కార్మికుల భర్తీ లేకపోవడంతో స్వచ్ఛత లోపిస్తున్నది. డ్రైనేజీలు, రహదారులు, వీధులు శుభ్రం చేసే స్వీపర్లు, ఇతర కార్మికుల సరిపడా లేక పట్టణాల్లో పారిశుద్ధ్యం పడకేస్తున్నది. మేడ్చల్‌–మల్కాజిగిరి జిల్లాలోని 13 పురపాలికల్లో దాదాపు ఇదే పరిస్థితి నెలకొన్నది. ఏళ్లుగా పట్టణాల్లో పారిశుధ్య విభాగాల్లో ఒక్క పోస్టు కూడా భర్తీ కాలేదంటే పరిస్థితి ఎలా ఉందో విదితమవుతోంది.

నిబంధనలకు తూట్లు..

రాష్ట్ర పురపాలక శాఖ పరిపాలనా విభాగం నిబంధనల ప్రకారం ప్రతి 10 వేల జనాభాకు 28 మంది రెగ్యులర్‌ పారిశుద్ధ్య కార్మికులు పనిచేయాల్సి ఉంటోంది. మేడ్చల్‌–మల్కాజిగిరి జిల్లాలోని బోడుప్పల్‌, పీర్జాదిగూడ, జవహర్‌నగర్‌ నిజాంపేట మున్సిపల్‌ కార్పొరేషన్లు, కొంపెల్లి, దుండిగల్‌, మేడ్చల్‌, నాగారం,తూంకుంట, గుండ్లపోంచపల్లి, దమ్మాయిగూడ, పోచారం, ఘట్‌కేసర్‌ మున్సిపాలిటీల్లో 2011 జనాభా లెక్కల ప్రకారం 4,24,239 జనాభా ఉంది. ప్రస్తుతం ఆయా పురపాలక సంఘాల్లో సుమారు 10 లక్షలకు పైగా జనాభా ఉంటుందని అంచనా. ఇటీవలే 7 మున్సిపాలిటీల పరిధిలోకి 28 గ్రామ పంచాయతీలు విలీనమైన విషయం తెలిసిందే. ఈ పురపాలక సంఘాల్లో 1746 మంది పారిశుద్ధ్య కార్మికులు అవుట్‌ సోర్సింగ్‌ కింద పని చేస్తున్నారు. అయితే పెరుగుతున్న జనాభా, కాలనీలకు అనుగుణంగా పారిశుద్ధ్య కార్మికుల సంఖ్యను పెంచకపోవడంతో ప్రస్తుతం పని చేస్తున్న వారిపైనే భారం పడుతోంది. దీంతో పలు పురపాలికల్లో చెత్త సమస్య తీరని వ్యథగా దర్శమిస్తోంది. సంబంధిత అధికారులు కూడా ఉన్న సిబ్బందితోనే పనులు చేయించాల్సి వస్తోంది. గ్రేటర్‌ హైదరాబాద్‌ శివారులోని 13 పురపాలికల్లో ప్రస్తుత జనాభా 10 లక్షల దాటవచ్చనంటున్నారు. ఈ లెక్క ప్రకారం ఆయా పురపాలకల్లో 2,840 మంది పారిశుధ్య కార్మికులు పనిచేయాల్సి ఉంటోంది. 13 పురపాలక సంఘాల్లో ప్రస్తుతం రెగ్యులర్‌ పారిశుధ్య కార్మికులు లేకపోవడంతోఅవుట్‌ సోర్సింగ్‌ సేవల కింద నియమించిన కార్మికులతోనే పారిశుధ్య వ్యవస్థను కొనసాగిస్తున్నారు.

ప్యానల్‌ పోస్టులకే ప్రాధాన్యం

పురపాలికల్లో కమిషనర్లు, ఇంజినీర్లు, టౌన్‌ ప్లానింగ్‌ అధికారులు, మేనేజర్లు, అకౌంటెంట్లు, ఆర్‌ఐలు, క్లర్కులు, బిల్‌ కలెక్టర్లు వంటిప్యానల్‌ పోస్టులు మాత్రమే భర్తీ చేస్తున్న ప్రభుత్వం పారిశుధ్య కార్మికుల విషయాన్ని మాత్రం పూర్తిగా నిర్లక్ష్యం చేస్తోంది. గతంలో టీఎస్‌పీఎస్సీ ద్వారా జిల్లాలోని పురపాలికల్లో ఇంజినీరింగ్‌, టౌన్‌ ప్లానింగ్‌, శానిటేషన్‌, రెవెన్యూ విభాగాల్లో ప్యానల్‌ పోస్టులు భర్తీ అయ్యాయి. అయితే అవసరమున్న పారిశుధ్య కార్మికుల పోస్టులు మాత్రం ఖాళీగానే ఉండిపోయాయి.

పురపాలక సంఘాల వారీగా ..

మేడ్చల్‌–మల్కాజిగిరి జిల్లాలోని 13 పురపాలకల్లో అవుట్‌ సోర్సింగ్‌ కింద 1746 మంది పారిశుధ్య కార్మికులు పని చేస్తున్నారు. ఇందులో మున్సిపాలిటీల వారీగా పారిశుధ్య కార్మికుల సంఖ్య ఇలా ఉంది. ఫీర్జాదిగూడలో 56 పారిశుధ్య కార్మికులు, నిజాంపేటలో 248, నాగారంలో 145, మేడ్చల్‌లో 139, కొంపెల్లిలో 188, జవహర్‌నగర్‌లో 90 మంది పని చేస్తున్నారు. బోడుప్పల్‌లో 182, దుండిగల్‌లో 150, ఘట్‌కేసర్‌లో 86, గుండ్లపోచంపల్లిలో 120, దమ్మాయిగూడలో 157, పోచారంలో 111, తూంకుంటలో 74 మంది అవుట్‌ సోర్సింగ్‌ కింద సేవలందిస్తున్నారు. అయితే ఇటీవల 7 మున్సిపాలిటీల పరిధిలో విలీనమైన 28 గ్రామ పంచాయతీల కార్మికుల సేవలను పారిశుధ్య పనులకు ఉయోగించుకుంటున్న పుర అధికారులు వారిని అధికారిగా మున్సిపల్‌ కార్మికులుగా గుర్తించాలని కార్మిక సంఘాలు కోరుతున్నాయి.

జాతీయ సదస్సును విజయవంతం చేయాలి

ఎంసీపీఐయూ గ్రేటర్‌ హైదరాబాద్‌ కార్యదర్శి రమేష్‌

మియాపూర్‌: సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నవంబర్‌ 7వ తేదీన జరగబోయే జాతీయ సెమినార్‌ను విజయవంతం చేయాలని ఎంసీపీఐయూ గ్రేటర్‌ హైదరాబాద్‌ కార్యదర్శి మైదంశెట్టి రమేష్‌ పిలుపునిచ్చారు.మియాపూర్‌ ఎంఏనగర్‌ పార్టీ కార్యాలయం ముందు గ్రేటర్‌ హైదరాబాద్‌ కమిటీ ఆధ్వర్యంలో జాతీయ సెమినార్‌ వాల్‌పోస్టర్‌ను శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హైదరాబాద్‌ ప్రస్తుత రాజకీయ పరిస్థితులు, మతోన్మాద కార్పొరేట్‌ శక్తుల ప్రమాదం, వామపక్ష కమ్యూనిస్టు శక్తుల కర్తవ్యం అనే అంశాలపై సెమినార్‌ జరుగుతుందని, ఈ సెమినార్‌కు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. గ్రేటర్‌ హైదరాబాద్‌ సహాయ కార్యదర్శి అనిల్‌కుమార్‌, కార్యదర్శి వర్గ సభ్యులు ఇస్లావత్‌ దశరథ్‌ నాయక్‌, పల్లె మురళి, భాగ్యమ్మ, మధుసూదన్‌, నారాయణ, ఆకుల రమేష్‌ తదితరులు పాల్గొన్నారు.


వరంగల్‌లోని ప్రతిమ ఆసుపత్రిలో వైద్య విద్యను అభ్యసించడానికి ప్రవేశం పొందిన ఖినా సుమయిరాను అభినందిస్తున్న పీఏసీ చైర్మన్‌ గాంధీ తదితరులు
– ఆల్విన్‌కాలనీ

నేటి నుంచి అయ్యప్ప స్వాములకు నిత్యాన్నదానం

కేపీహెచ్‌బీకాలనీ: హరిహర పుత్ర భక్త సమాజం ఆధ్వర్యంలో ఆదివారం నుంచి డిసెంబర్‌ 31వ తేదీ వరకు అయ్యప్ప స్వాములకు నిత్య అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. కేపీహెచ్‌బీకాలనీ, 3వ ఫేజ్‌లోని శ్రీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో నిత్య అన్న దాన సమారాధన కార్యక్రమం జరుగుతుందని ఆలయ నిర్వాహకులు ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 12.30 నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు జరిగే అన్న సమారాధనను విజయవంతం చేయాలన్నారు.

సదస్సుకు తరలిన కాంగ్రెస్‌ నాయకులు

మోతీనగర్‌: మేడ్చల్‌ జిల్లాలో కుటుంబ సమగ్ర సర్వేపై జరిగిన అవగాహన సదస్సుకు అల్లాపూర్‌ డివిజన్‌ కాంగ్రెస్‌ పార్టీ సీనియర్‌ నాయకుడు డి. మస్తాన్‌రెడ్డి ఆధ్వర్యంలో శనివారం తరలి వెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 6వ తేదీ నుంచి ప్రారంభమయ్యే ఇంటింటి కుటుంబ సమగ్ర సర్వే కోసం వచ్చే అధికారులకు ప్రతి కుటుంబ సభ్యుడు కుటుంబంలోని ప్రతి అంశాన్ని అధికారులకు క్లుప్తంగా వివరించాలని సూచించారు. కార్యక్రమంలో టీపీసీసీ అధికార ప్రతినిధి సత్యం శ్రీరంగం, ఎస్‌ రంగారావు, సతీష్‌ రెడ్డి, భాను యాదవ్‌ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్‌ వినియోగదారుల సదస్సు

కూకట్‌పల్లి: విద్యుత్‌ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా విద్యుత్‌ వినియోగదారుల సేవా కేంద్రం కేపీహెచ్‌బీ సబ్‌ స్టేషన్‌ ఆవరణలో సదస్సు నిర్వహించనున్నట్లు కొండాపూర్‌ డివిజనల్‌ ఇంజనీర్‌ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సేవా కేంద్రంలో కొండాపూర్‌, గచ్చిబౌలి పరిధిలోని విద్యుత్‌ వినియోగదారులు పాల్గొని సమస్యలను పరిష్కరించుకోవచ్చని తెలిపారు. ఆదివారం ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

బాలానగర్‌: విద్యుత్‌ బిల్లులు, లో ఓల్టేజ్‌ సమస్యలు, మీటర్‌కు సంబంధించిన సమస్యలు, ఇతర విద్యుత్‌ సమస్యలు ఉన్నట్టైతే విద్యుత్‌ వినియోగదారులు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేయాలని విద్యుత్‌ డివిజన్‌ ఇంజనీర్‌ గోపాల్‌రావు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. బోయిన్‌పల్లిలోని డివిజన్‌ విద్యుత్‌ ఇంజనీర్‌ కార్యాలయంలో విద్యుత్‌ వినియోగదారుల దినోత్సవాన్ని ఆదివారం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బాలానగర్‌ సెక్షన్‌, ఫిరోజ్‌గూడ, ఐడీపీఎల్‌, రంగారెడ్డినగర్‌, ఓల్డ్‌ బోయినపల్లి, న్యూ బోయినపల్లి సెక్షన్లకు సంబంధించిన విద్యుత్‌ వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.


బీసీల ప్రాధాన్యత కోసమే కుల గణన

శాసనమండలి చీఫ్‌ విప్‌ పట్నం మహేందర్‌రెడ్డి

కుత్బుల్లాపూర్‌: బీసీలకు అన్ని రంగాల్లో సముచిత న్యాయం చేసేందుకే రాష్ట్ర ప్రభుత్వం కుల గణన కార్యక్రమాన్ని చేపట్టిందని శాసన మండలి చీఫ్‌ విప్‌ పట్నం మహేందర్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్‌ జిల్లా అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి అధ్యక్షతన శనివారం కొంపల్లి కేవీఆర్‌ గార్డెన్స్‌లో కులగణన సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కుల గణన సందర్భంగా జరిగే కుటుంబ సర్వేకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. కాంగ్రెస్‌ కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు తమ ప్రాంతాల్లో జరిగే కులగణనలో భాగస్వాములై అధికారులకు సహకరించాలని సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌ మల్కాజిగిరి ఇన్‌చార్జి సునీతామహేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు సుధీర్‌ రెడ్డి, మైనంపల్లి హనుమంతరావు, కూన శ్రీశైలంగౌడ్‌, కుత్బుల్లాపూర్‌ నియోజకవర్గ ఇన్‌చార్జి కొలన్‌ హన్మంతరెడ్డి, జంగయ్య యాదవ్‌, పరమేశ్వర్‌ రెడ్డి, బండి రమేష్‌, డాక్టర్‌ జి.వి.వెన్నెల, మాజీ డీసీసీ అధ్యక్షుడు ప్రతాప్‌, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డి, తెలంగాణ రాష్ట్ర విద్యా కమిషన్‌ సభ్యురాలు జ్యోత్స్నరెడ్డి, తెలంగాణ రాష్ట్ర రైతు కమిషన్‌ సభ్యురాలు భవానీ, జిల్లా నాయకులు, బ్లాక్‌ అధ్యక్షులు, యువజన కాంగ్రెస్‌ నాయకులు పాల్గొన్నారు.

కనుల పండువగా సదర్‌ ఉత్సవం

ఓల్డ్‌బోయిన్‌పల్లి: విభిన్న అలంకరణలతో అందంగా ముస్తాబైన దున్నలు..డప్పుల దరువులకు లయబద్ధంగా నృత్యాలు.. రాజకీయ నాయకులు, ప్రజల సందడితో ఓల్డ్‌ బోయిన్‌పల్లిలో శుక్రవారం రాత్రి జరిగిన సదర్‌ ఉత్సవం శనివారం తెల్లవారు జాము వరకు కోలాహలంగా జరిగింది. ఓల్డ్‌ బోయిన్‌పల్లి యాదవుల సంఘం, హస్మత్‌పేట్‌, అంజయ్యనగర్‌ యాదవుల ఆధ్వర్యంలో ఉత్సవాలు చివరి వరకు ఉత్సాహంగా కొనసాగాయి. ఉత్సవంలో ఆయా ప్రాంతాలకు చెందిన దున్నపోతులను అలంకరించి విన్యాసాలు చేయించారు. శ్రీకృష్ణుడికి ఘనంగా పూజలు నిర్వహించారు. డప్పుల దరువులతో దున్నలను వివిధ ప్రాంతాల నుంచి తీసుకొచ్చారు. కార్యక్రమంలో కార్పొరేటర్‌ ముద్దం నర్సింహయాదవ్‌, కర్రె జంగయ్య, కృష్ణ యాదవ్‌, సంతోష్‌ యాదవ్‌, నంద్‌ యాదవ్‌, కిషోర్‌ యాదవ్‌, నరేందర్‌ యాదవ్‌, కుమార్‌ యాదవ్‌, రాజు యాదవ్‌, చందు యాదవ్‌, మన్నె ఉదయ్‌ యాదవ్‌, మల్లేష్‌ యాదవ్‌, బుర్రి యాదగిరి పాల్గొన్నారు.


హస్మత్‌పేట సదర్‌లో దున్నల యజమానులకు బహుమతులను అందజేస్తున్న కార్పొరేటర్‌

మూసాపేట: కైత్లాపూర్‌ యాదవ సంఘం ఆధ్వర్యంలో సదర్‌ ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఉత్సవాలకు ముఖ్య అతిథిగా మాజీ కార్పొరేటర్‌ పగుడాల బాబూరావు హాజరయ్యారు. కార్యక్రమంలో అంబటి శ్రీనివాస్‌, ఐలయ్య యాదవ్‌, ఎల్లేష్‌ యాదవ్‌, వెంకటేష్‌ యాదవ్‌, కర్క పెంటయ్య, కేబుల్‌ శ్రీను, మల్లేష్‌ యాదవ్‌, వీరేశం యాదవ్‌, శ్రీశైలం యాదవ్‌, బాలరాజు యాదవ్‌, కె. సంతోష్‌, యాదయ్య గౌడ్‌, బాలయ్య, అశోక్‌ తదితరులు పాల్గొన్నారు.

మూసాపేట చౌరస్తాలో..

మూసాపేట యాదవ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సదర్‌ ఉత్సవాలకు ముఖ్య అతిథులుగా మూసాపేట మాజీ కార్పొరేటర్‌ తూము శ్రావణ్‌కుమార్‌, మాజీ కార్పొరేటర్‌ బాబూరావు హాజరయ్యారు. కార్యక్రమంలో డివిజన్‌ అధ్యక్షులు అంబటి శ్రీనివాస్‌, సీనియర్‌ నాయకులు కర్క పెంటయ్య, రాము, ఖాజా, రమేష్‌, ఎల్లేష్‌ యాదవ్‌, శ్రీకాంత్‌ యాదవ్‌, కుమార్‌ యాదవ్‌, నర్సింహ యాదవ్‌, గణేష్‌యాదవ్‌ పాల్గొన్నారు.


మూసాపేట చౌరస్తా వద్ద ఉత్సవంలో పాల్గొన్న మాజీ ప్రజాప్రతినిధులు, యాదవులు


సదర్‌ ఉత్సవంలో పాల్గొన్న బాబూరావు తదితరులు

శ్మశాన వాటికలో వసతులు కల్పించాలి


కార్పొరేటర్‌తో మాట్లాడుతున్న ముస్లిం మత పెద్దలు

మోతీనగర్‌: ముస్లిం శ్మశాన వాటికలో మౌలిక వసతులు కల్పించాలని ముస్లిం మత పెద్దలు కోరారు. కార్పొరేటర్‌ సబిహాబేగంను ఆమె కార్యాలయంలో రామారావునగర్‌ ముస్లిం మత పెద్దలు శనివారం కలిశారు. శ్మశాన వాటికలో రేకుల షెడ్డు, బాత్‌రూం, ప్రహరీ నిర్మాణం, పెయింటింగ్‌, వాటర్‌ ట్యాంక్‌, ఇతర మౌలిక వసతులు కల్పించాలని కోరారు. అనంతరం కార్పొరేటర్‌ మాట్లాడుతూ.. ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు దృష్టికి సమస్యలను తీసుకెళ్లి పరిష్కారం అయ్యేలా కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో డివిజన్‌ ప్రధాన కార్యదర్శి పిల్లి తిరుపతి, నాగుల సత్యం, మహ్మద్‌ మన్సూర్‌ తదితరులు పాల్గొన్నారు.

మోతీనగర్‌లో సదర్‌ సమ్మేళనం



సదర్‌లో పాల్గొన్న నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు

మోతీనగర్‌: తెలంగాణ యాదవ మహాసభ, మోతీనగర్‌, తెలంగాణ యాదవ మహా సభ ఎర్రగడ్డ ఆధ్వర్యంలో సదర్‌ సమ్మేళనాన్ని మోతీనగర్‌ చౌరస్తాలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మూసాపేట మాజీ కార్పొరేటర్‌ తూము శ్రావణ్‌కుమార్‌, మాజీ కౌన్సిలర్‌ సీహెచ్‌. సత్యనారాయణ, డివిజన్‌ అధ్యక్షులు అంబటి శ్రీనివాస్‌ హాజరై దున్నపోతుల విన్యాసాలను తిలకించారు. కార్యక్రమంలో మహేష్‌ యాదవ్‌, జలేందర్‌ యాదవ్‌, కమలాకర్‌, బీఆర్‌ఎస్‌ నాయకులు అరుణ్‌, రాము, అక్బర్‌ తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప స్వాములకు అన్నదానం


అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్‌ మందడి శ్రీనివాసరావు

కేపీహెచ్‌బీకాలనీ: కేపీహెచ్‌బీ మూడవ ఫేజ్‌లోని వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయంలో అయ్యప్ప స్వాములకు అన్నదాన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు కార్పొరేటర్‌ మందడి శ్రీనివాసరావుతో కలిసి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అయ్యప్ప స్వాములకు ప్రతి సంవత్సరం అన్నదానం చేయటం సంతోషకరమైన విషయమన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్‌ జూపల్లి సత్యనారాయణ, మాజీ కార్పొరేటర్‌ బాబూరావు, ఆలయ చైర్మన్‌ కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.